

# నామకరణం

శ్రీ ధరణికోట శ్రీనివాసులు

పురిటిగది ప్రవేశించి ఆనాటికి పదిరోజు లైంది మా కనకం. అంతవరకు ఆమెను నేను చూడలేదు. ఇంట్లో పెద్దవాళ్లుండగా నేను చూడవలసిందేముంది? ఆనాడు ఆది వారం కావడంవల్ల యింట్లోనే వున్నాను. అమ్మగూడా అంది, 'దాన్ని ఓ సారి చూడ గూడదురా' అని. సరే అనుకొని పురిటిగది ముందు కొచ్చి తొంగి చూచా.. యేవో మధురస్వప్నాలు కంటూ పసిపాపను తన గుండెకాయగా ఒళ్లో పెట్టుకొని మహా నందం అనుభవిస్తూవుంది. ప్రపంచాన్నంతా ఆగదిలోనే చూస్తూంది. తన బిడ్డనుగురించి యెన్నో తియ్యటి కలలు కంటోవుంది.

అమ్మాయి చక్కగా చదువుకుంటుంది. పెద్దదవుతుంది. వైభవంగా పెళ్లిఅవుతుంది. అత్తారింటికి వెళ్లుతుంది. యెన్నో వేడుకలు జరుగుతాయి. తనకు ఓ అల్లుడంటూ వస్తాడు యెన్నో హిరణ్యాక్షవరాలు అడుగుతుం టాడు. యివ్వలేక యింటివాళ్లు మాట్లు తారు. యేదోవిధంగా వాళ్లకుమట్టచెప్పాలి అంటూ తను బిడ్డపక్షాన వాదిస్తుంది. "అబ్బా యెంతగోల తెచ్చిపెట్టింది. మా కనకం బిడ్డను కని! చల్లగా వున్న యింట్లో ఓ తుఫాను పుట్టించిందే!......"

'కనకం' అంటూ పిల్చా. నావైపుచూచి చల్లగా నవ్వింది సిగ్గు అభినయిస్తూ, తను చెయ్యవలసిన పని అంతటితో పూర్తి అయి నట్టుగా.

"ఆరోగ్యంగా వుందా శరీరం ? కనకం" అన్నాను నేను. ఉన్నానన్నట్టుగా తలవూ పింది కనకం.

"పాపను చూస్తావట్రా! అంటూ అమ్మ గదివైపు వచ్చింది.

"యిప్పుడేం చూడడమమ్మా అసహ్యం గానూ, తర్వాత చూడొచ్చులే" అన్నాను.

"రంగు, రూపు తల్లిలాగే వుంటుందిరా. కాళ్లుమాత్రం మీ బామ్మలాగు దొడ్డికాళ్లు. ముక్కు సరిగ్గా నీదే!" అంటూ వర్ణన మొద లెట్టింది అమ్మ.

"అప్పుడే యెలాగు తెలుస్తుందమ్మా. పసి కూన" అన్నాను నేను.

"తెలియకపోవడ మేమిటిరా. సరిగ్గా కనపడుతుంటేను. ఆ కనుబొమ్మలు చూశావూ సరిగ్గా తాతవే - కళ్లుమాత్రం నావి", అని ఆవిడ మురిసిపోయింది.

"యేమిటో మీ ఆడవాళ్ల మాటలు. యింకా కళ్లైనా తెరువలేదు, అప్పుడే నీ కళ్లలాగే వున్నాయని యేలాగ కనుపిం చాయే!" అంటూ నాన్న వచ్చాడు గది వైపు.


"అట్లా మాట్లాడ్తారేం. పసికూనైతే మాత్రం ముక్కు మొహం పరిమితి తెలి యదూ!...కోడలంటుంది వాళ్ల అమ్మమ్మ కళ్లలా గున్నాయని. ముక్కూ మొహం సరిగ్గా వాళ్ల నాన్నలాగే వున్నాయని-కాని నేను బతికివుంటే చూస్తాను కళ్లుమాత్రం వాళ్ల అమ్మమ్మకళ్లు కావు. నేను ఆవిడను చూచానుకదూ. ఆవిడవి పిలకళ్లు. మామూ లుగా కురచగా వుండేమనిషి. మన చంటి దెక్కడ. ఆవిడ యెక్కడ. కవుచిప్పల్లాగ కళ్లు, భారీ శరీరం నా అమ్మది. సరిగ్గా చేయెత్తుమనిషి అవుతుంది" అంటూ ముగిం చింది తన ధోరణిని అమ్మ.

"పిల్లలకు మహా వస్తే తలిదండ్రుల పోలి కలు వస్తాయేమో కాని అమ్మమ్మ పోలికలు తండ్రి, మేనమామకూతురు పోలికలు వస్తా యామ్మా నీ చాదస్తం కాకపోతే"అన్నాను నేను.

"రాకపోవడ మేమిటి రా - నీ వాలకం అంతా మా తాతదే. చెల్లాయిను చూచావూ. సరిగ్గా మా అమ్మే - కళ్లుమాత్రం మా చెల్లెలివి. నడుస్తూవున్నప్పుడు వెనకనుంచి చూస్తే సాక్షాత్ మా అమ్మలాగే కనబడుతుంది. దాన్ని చూచినప్పుడల్లా అమ్మ జ్ఞాపకాని కొస్తుంది". అంటూ కంట నీరొత్తుకుంది అమ్మ.

"నీ పుట్టింటివరస నీ పిల్లల కొచ్చినట్టు నీ కోడలుపిల్లలకు దాని పుట్టింటివరస రా కూడదేం" అన్నాడు నాన్న నవ్వుతూ.

(24-వ పేజీ చూడుడు)



పడమటి యూనియను నాయకుల సమావేశం షిస్వెల్ ప్రభృతులైన అయిదు బ్రసెల్సు సంధి రాజ్యాల రక్షణ మంత్రులు యూనియన్ ప్రధాన కార్యాలయంలో సమావేశమైనారు.

# నామకరణం

(16-వ పేజీ తరువాయి)

"రాకూడదని నేనన్నానండీ రాలేదని అన్నాను వస్తే వచ్చిందని అనడానికి నాకేం"అంటూ కొంచెం మొహం ముడుచుకుంది.

"పోనీ - యేది వచ్చి యేది రాకున్నా నీ సోదిమాత్రం నీ మనమరాలికి రాకుండా వుంటే సంతోషిస్తాం" అన్నాడు నాన్న

అందరం నవ్వాం అమ్మకు కోపం వచ్చినది యింట్లోకి వెళ్లుతూ "యేదోలెండి, ఈసోదితో యెలాగో కాలం గడిచింది" అని గొణిగింది

* * *

భోజనం చేస్తూవున్నప్పుడు అమ్మ అడిగింది. "చంటిదానికి యేం పేరు పెట్టాలని అనుకుంటున్నావ్రా నాయనా" అని

"యేదో మీ యిష్టమొచ్చింది పెట్టండమ్మా - పెద్దవాళ్లుండగా మా దేమిటి" అన్నాను నేను

"యిప్పటిపేర్లు యెవరికీ తెలియాలి నాయనా రెండే అక్షరాలు మెరపుల్లాగ వుంటాయేగిరి - సుశీ-లత-ముక్తరమ అవి-రామరాను ఒక్కక్షరం పేర్లు వస్తాయేమో క - గ - అ - ఇ - అని" అంది అమ్మ.

"పోనీ నీ యిష్టమొచ్చినట్టు పెట్టుకోవమ్మా" అన్నాను నేను

"అసలు విషయం చెప్పడం మరచాను మీ బామ్మకు నీవంటే ప్రాణం. పాపం బతికి వున్నప్పుడు ప్రేమకొద్దీ యెన్నో సార్లు అంటూవుండేది నీ కడుపులో పుడ్తానని. మీ నాన్నకు గూడా ఆమె పేరు పెట్టుకోవాలని వుంది." అని అన్నది అమ్మ

"అయితే సరి - ఆమె పేరే పెట్టండి" అన్నాను

* * *

కనకం అడిగింది "యేమండీ అమ్మాయి పేరు యేం పెట్టుకుందాం" అని

"నీయిష్టం వచ్చింది పెట్టు కనకం" అన్నాను

"మా అమ్మ పేరు పెట్టుకోవాలని వుందండీ ఆమె జ్ఞాపకార్థం మా నాన్న మొన్న వచ్చినప్పుడు అదే అన్నాడు. అమ్మ పోయి యిప్పటికి నాలుగుసంవత్సరాలయింది మొన్న స్వప్నంలో కనపడి చెప్పింది. తన జ్ఞాపకార్థం తన పేరు పెట్టుకొమ్మని" అంది కనకం.

"అయితే యింకేం. ఆమె పేరే పెట్టుకో" అన్నాను నేను.

* * *

నామకరణంరోజు నాన్న అడిగాడు. "బిడ్డకు యేం పేరు పెట్టుకుంటావయ్యా" అని.

"వెంకటరత్నం" అన్నాను నేను.

"అబ్బే - యేం బావుంటుందిరా - పాత పేరు" అన్నాడు నాన్న

"బామ్మపేరు, అత్తయ్య పేరు కలిసి వస్తుంది నాన్నా యీ పేరులో. బామ్మ పేరు పెట్టాలని కొందరి యిష్టం అత్తయ్య పేరు పెట్టాలని కొందరి యిష్టం. అంచేత అందరినీ సంతోషపెట్టడానికి ఈ పేరు బావుంటుందని నా వుద్దేశ్యం" అన్నాను నేను

"అలాగా.. బాగానే వుంటుంది" అన్నాడు నాన్న

* * *

పాప కనకం చేతుల్లో వున్నప్పుడు 'రత్నం' అని పిలుచుకొని మా కనకాన్ని సంతోషపెట్టున్నాను

పాప అమ్మనాన్న చేతుల్లో వున్నప్పుడు 'వెంకటా' అంటూ పిల్చుకొని వాళ్లని సంతోషపెట్టున్నాను

అంతా కలిసి కూర్చున్నప్పుడు 'వెంకటరత్నం' అని పిల్చుకొని అందరినీ సంతోషపెట్టున్నాను.

దీనితోపాటు యింకో యిద్దరినీ సంతోషపెట్టున్నానేమో ?

అందరిసంతోషమే నా సంతోషము

---


## గర్భ నిరోధిని

శరీరారోగ్యమునకు భంగంలేకుండ కొంతకాలమువరకు గర్భం రాకుండ ఆపుటకు ఔషధం రు 10 లు చాలాకాలంవరకు రాకుండ చేయుటకు రు 25 లు. పో. ఖ ఛార్జి రు 1-0-0

డాక్టర్ రత్నం నన్సు,

మొంకపేట బిల్డింగ్సు, హైద్రాబాద్, దక్కన్